క్లుప్తంగా

పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్ వద్ద మంగళవారం ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాలను తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ట్రాఫిక్ ఎస్సై దత్తు ప్రసాద్ ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీవో సుదర్శన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్ పంచాయతీ పరిధిలో ఇల్లు నిర్మించుకున్నా.. ఇంటి నెంబర్లు అక్రమంగా కేటాయించారంటూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదుపై మంగళవారం మండలపరిషత్ అధికారి సుదర్శన్ మంగళవారం విచారణ చేపట్టారు. సర్పంచ్ ఆడెపు వెంకటేశం, ఎంపీటీసీ తోట శ్రీనివాస్ పలువురు వార్డుసభ్యులు హాజరయ్యారు. విచారణ నిష్పక్షపాతంగా జరిపి పంచాయతీలో అక్రమంగా కేటాయించిన ఇంటినెంబర్లను రద్దుపరచాలని మాజీ సర్పంచ్ రామస్వామి, నాయకులు తాడిచెట్టి శ్రీకాంత్, వంశీ ఎంపీవోను కోరారు. అయితే విచారణ జరిపిన అనంతరం నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంపీవో తెలిపారు.

మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యం



మాట్లాడుతున్న షీ టీమ్ ఏఎస్సై మల్లారెడ్డి

ధర్మారం: జిల్లాలో మహిళల భద్రతే షీ టీమ్ లక్ష్యమని పెద్దపల్లి షీ టీమ్ ఏఎస్సై మల్లారెడ్డి అన్నారు. ధర్మారం మండల కేంద్రంలోని ఆదర్శ మోడల్ విద్యాలయంలో మంగళవారం షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే షీ టీమ్ ఫోన్ నెంబర్ 6303923700కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ దీనా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలోని ఈదునూరి సతీశ్ అనే యువకుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కాగా అతడి కుటుంబానికి రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రూ.10వేల ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఆలయ ఉద్యోగి బదిలీ

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దేవాదాయశాఖ నుంచి జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఎస్.జితేందర్ బదిలీ అయ్యారు. మహబూబాబాద్‌లోని కురవి శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు.

మట్టి అక్రమ రవాణాను ప్రశ్నిస్తే ఆరోపణలా?

పాలకుర్తి: మట్టి అక్రమ రవాణాను ప్రశ్నించినందుకు మీడియాపై బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యం అనిల్ చేసిన ఆరోపణలను బీజేపీ మండల అధ్యక్షుడు పత్తి సంజీవ్ ఖండించారు. మండలం నుంచి మట్టి అక్రమంగా రవాణా అవుతోందని, దీన్ని వెలుగులోకి తీసుకొచ్చిన మీడియాకు ఫోన్‌చేసి దుర్భాషలాడడం అధికార పార్టీ నాయకులకే చెల్లిందన్నారు.

గోరింటాకు వేడుకలు



గోదావరిఖనిటౌన్: పట్టణంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మహిళలు ఆషాఢమాసం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్ నగునూరి సుమలత, మాతృశక్తి జిల్లా సంయోజిక జ్యోతి, ఏఎస్సై శారద, అన్నపూర్ణ, భవాని, దుర్గావాహిని, తిరుమల, మమత, రమణి, కరుణ, కమల, లత, భాగ్య, విజయ, పార్వతి పాల్గొన్నారు.

అంధకారంలో కార్పొరేషన్ రోడ్లు

- వీధిదీపాలు లేక నిత్యం ప్రమాదాలు
- నిర్లక్ష్యానికి ఖరీదు ఐదుగురు మృతి
- ప్రమాదకరంగా డివైడర్లు
- పట్టించుకోని అధికారులు



వీధిదీపాలు లేకపోవడంతో అంధకారంగా ఉన్న రోడ్డు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, శాంతినగర్, గౌతమినగర్, సంజయ్‌గాంధీనగర్, మాతంగికాలనీ ఏరియాలో రోడ్లలో కార్పొరేషన్ వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు సంవత్సరంలో వీధి దీపాలు లేక రోడ్డుపై ప్రమాదాలు జరిగి ఐదుగురు మృత్యువాత పడ్డారు, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వరుసగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా కార్పొరేషన్ అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని వాహదారులు ఆరోపిస్తున్నారు.

వీధిదీపాలు లేక ప్రమాదాలు..

ప్రగతినగర్‌లో వీధి దీపాలు లేకపోవడంతో చీకట్లో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గేదెను తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖాజీపల్లిలో పెట్రోల్ బంక్ ఎదురుగా లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందారు. ఈ ప్రమాదాలు కేవలం వీధి దీపాలు లేకపోవడంతో జరిగాయని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధిదీపాలు ఉంటే ప్రమాదాలు జరగకపోయేవని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్పొరేషన్ పరిధిలోని గౌతమినగర్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం చొరవ చూపి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలి. గౌతమినగర్ రైల్వేగేట్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు చేపట్టాలి. కార్పొరేషన్, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారులు స్పందించి లైట్లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి.
– పొన్నం రజిత, ప్రగతినగర్

ప్రమాదకరంగా డివైడర్లు



గౌతమినగర్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్ వరకు ప్రయాణించే వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ప్రగతినగర్ వద్ద వీధిదీపాలు లేకపోవడంతో నెలలో రెండు, మూడు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రగతినగర్‌లో గేదె అడ్డురావడంతో రోడ్డు డివైడర్‌కు ఢీకొని ఒక వ్యక్తికి ప్రమాదం జరిగింది. అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీధి దీపాలు ఉంటే ప్రమాదం జరిగేది కాదు.
– మేకల శ్రీనివాస్, ఖాజీపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గౌతమినగర్ రైల్వేగేట్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తాం. రోడ్డుపై ప్రతిరోజూ వందలాది యూరియా లారీలు, అమ్మోనియా ట్యాంకులు నిత్యం ప్రయాణిస్తుంటాయి. రాత్రివేళల్లో వీధిదీపాలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కార్పొరేషన్, ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలకు వినతిపత్రం అందిస్తాను.
– జెట్టి జ్యోతి, కార్పొరేటర్, 39వ డివిజన్

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



రక్తదానం చేస్తున్న ఉద్యోగి

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్, కాసర్ల శ్రీనివాస్, టెక్నీషియన్ విజయ్ శిబిరాన్ని నిర్వహించారు. డిపో మేనేజర్ పి.మల్లేశం, అసిస్టెంట్ మేనేజర్ గీతాకృష్ణ, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వలీమహ్మద్, సూపర్‌వైజర్లు ఎం.చంద్రయ్య, రాజలింగం, ఎస్.ఎస్ మూర్తి, డి.రాములు, పి.లింగయ్య, కె.ఆర్ రెడ్డి పాల్గొన్నారు.

మంథని బస్సుడిపోలో 50 మంది..

మంథని: మంథని ఆర్టీసీ బస్సు డిపోలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తం సేకరించారు. హెచ్‌డీఎఫ్‌సీ మంథని బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ రక్తదాతలకు పండ్లు, స్నాక్స్ అందించారు. మంథని ఇన్‌చార్జి తహసీల్దార్ సిరిపురం గిరి క్యాంపు ప్రారంభించగా డిపో సూపరింటెండెంట్ శంకర్, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఏంజల్, గ్యారేజీ ఇన్‌చార్జి స్వామి, సెక్యూరిటీ ఇన్‌చార్జి సాగర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం పట్టని కేసీఆర్ సర్కార్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న దాసరి ఉష

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆరోపించారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామంలో మంగళవారం ప్రజలతో సమావేశమై సమస్యలపై ఆరా తీశారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో విద్య, వైద్యం సరిగ్గా అందక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. మహిళలు ఇంటివద్దే ఉంటూ పనిచేసుకుని ఉపాధి పొందేలా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తానన్నారు.

మధ్యాహ్న కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను సత్వరమే చెల్లించాలని మంగళవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ ఆధ్వర్యంలో ఉమ్మడి రామగుండం మండల విద్యాధికారి కార్యాలయ సబార్డినేట్ శ్రీధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులతో జూలై 1వ తేదీ నుంచి జిల్లా కలెక్టరేట్‌లో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. సుమలత, మమత, పద్మ, రమాదేవి, సునీత, అంజుమ్, ఫాతిమా, రజిత, శ్రీనివాస్ ఉన్నారు.

జీపీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

కాల్వశ్రీరాంపూర్: పంచాయతీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అంబాల లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులు జూలై 6 నుంచి నిర్వహించనున్న నిరవధిక సమ్మె కరపత్రాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. గట్టయ్య, గౌసుద్దీన్, సురేశ్, మొట్టు లక్ష్మణ్, చల్ల రాజయ్య, పోచాలు, రామస్వామి, మహేశ్, మధునయ్య, సుశీల, రాజబాబు పాల్గొన్నారు.

దుకాణ సముదాయాల అనుమతికి కృషి

మంథని: మంథని వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో దుకాణ సముదాయాల నిర్మాణానికి త్వరగా అనుమతి తీసుకురావడానికి కృషి చేయనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి తెలిపారు. మార్కెట్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలి

కమాన్‌పూర్: ఆర్జీ–3 ఏరియాలోని నర్సరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి కార్మికులు మెరుపు సమ్మె చేపట్టారు. ఫిబ్రవరి నుంచి కొత్త వేతనాలు పెంచాల్సి ఉండగా వేతనాలు పెంచకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. కార్మికులు ఫారెస్టు అధికారి కర్ణ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో సమ్మె చేపట్టారు. సమ్మె చేస్తున్న కార్మికులు వద్దకు వచ్చిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే డివిజన్‌వ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. పార్టీ నాయకులు శ్రీనివాస్, తీగల శ్రీధర్ మద్దతు తెలిపారు. రమేశ్, రాజమ్మ, లక్ష్మి, రాణి, పద్మ, కోమల పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆బట్ట సంచులు పంపిణీ

జూలపల్లి: కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు బట్ట సంచులను సేవాదళం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు.

◆అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు ఎంపీపీ రమాదేవి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 13 గ్రామపంచాయతీల్లో 62 పనులకు .1.30కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

◆పరామర్శ

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జీడీకే–11గని ఫిట్ సెక్రటరీ తల్లిని మంగళవారం పరామర్శించారు. వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. అలాగే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పలువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు. నాయకులు మహంకాళి స్వామి, గాదం విజయానంద్, కాలువ లింగస్వామి, మాజీ కార్పొరేటర్ చుక్కల శ్రీనివాస్ ఉన్నారు.

◆గోశాలకు ముస్లిం యువకుడి విరాళం

సుల్తానాబాద్: పట్టణంలోని యాదవ గర్‌లో ఉన్న శ్రీధర్మశాస్త్ర గోశాలకు ఈద్గా కమిటీ చైర్మన్ తాహేర్ పశుగ్రాసం కోసం మంగళవారం రూ.వెయ్యి విరాళం అందజేశారు. సుల్తానాబాద్ సీఐ జగదీష్, ఎస్సై విజేందర్ ఆధ్వర్యంలో పశువుల పశుగ్రాసం కోసం విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు.

◆సీతారామ సేవాసదన్ చేయూత

మంథని: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అన్నారం శ్రీధనలక్ష్మి నందీశ్వర గోశాల చారిటబుల్ ట్రస్టుకు మంథనిలోని సీతారామ సేవాసదన్‌కు రూ.80వేల విలువ చేసే బోర్‌వెల్‌కు సాయం అందించారు. అలాగే మంథనిలోని జానకీరామ కల్యాణ మండపానికి ప్రజల దాహార్తి తీర్చడానికి మంచినీటి కూలర్ అందించారు. సంస్థ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, గణపతి, ప్రహ్లాద్, గంగాధర్, మహాదేవ్, సత్యనారాయణ ఉన్నారు.

◆ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: ఓదెల నుంచి పెద్దపల్లి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి రూ.36కోట్లు మంజూరు చేయించారని హర్షం వ్యక్తం చేస్తూ ఓదెలలో స్థానిక ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. పెద్దపల్లి మార్కెట్ వైస్‌చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, ఉపసర్పంచ్ తీర్థాల కుమార్, మార్కెట్ మాజీ డైరెక్టర్ బోడకుంట నరేశ్, బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ సతీశ్, బుద్దె పోశెట్టి, కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

◆రైతులకు కంది విత్తనాలు పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రైతువేదికలో మంగళవారం రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తనాలు, పురుగు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

◆పీవైఎల్ జిల్లా ఆరో మహాసభలో తీర్మానం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామం ఉన్న భగత్‌సింగ్ భవన్‌లో మంగళవారం ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ఆరో మహాసభలు నిర్వహించారు. ఉద్యోగ ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలని, ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని పలు తీర్మానాలు చేశారు. జూలై 4, 5వ తేదీల్లో ఇల్లందులో జరిగే రాష్ట్ర 8వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు కాసిపేట ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి ఆరుముళ్ల తిరుపతి, ఉపాధ్యక్షులు సమ్మెట తిరుపతి, బొంతు ఆనంద్, సహాయ కార్యదర్శులు మనోజ్, సుధాకర్, కోశాధికారి తిర్రి బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు రామ్‌కీ, సతీశ్, సురేశ్, అజయ్, శివకుమార్ ఉన్నారు.

శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్ అందజేత



విద్యార్థులతో లయన్స్ క్లబ్ సభ్యులు

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు కరీంనగర్‌లోని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ కాశేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్ అందజేశారు. నేనున్నా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ సూచనతో రూ.20వేల విలువ గల శానిటరీ ప్యాడ్స్ అందించినట్లు వివరించారు. అధ్యక్షురాలు అనురాధ, ఎంపీపీ రమాదేవి, క్లబ్ సభ్యులు ఫనిత, స్వరాజ్యలక్ష్మి, సర్పంచ్ నర్సింహయాదవ్, ఎంపీటీసీ మమత, ఉపసర్పంచ్ మహేశ్, విద్యా కమిటీ చైర్మన్ ఎదుల్ల కనుకయ్య, హెచ్‌ఎం సరస్వతి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు



ప్రశంసాపత్రాలు అందిస్తున్న హెచ్‌ఎం శ్రీధర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలను ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ మంగళవారం ప్రారంభించారు. రామగుండం మండలంలోని 9 జిల్లా పరిషత్ హైస్కూళ్ల నుంచి ఇద్దరు చొప్పున 18 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్(రామగుండం), ద్వితీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్(బాలికలు–గోదావరిఖని), తృతీయ స్థానంలో జెడ్పీహెచ్‌ఎస్(ఎన్టీపీసీ)లు నిలిచారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందించారు. మండలస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఓదెల మోడల్ స్కూల్‌లో..

ఓదెల: ఓదెల మోడల్ స్కూలులో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మోడల్ పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఓదెల మోడల్‌స్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థినులు పి.అభిజ్ఞకు ప్రథమ, వర్షిణికి ద్వితీయ బహుమతి ఎంఈవో ఆరెపల్లి అందజేశారు. ప్రిన్సిపాల్ ఎండీ జావీద్, ఉపాధ్యాయుడు ఆకుల రమేశ్ పాల్గొన్నారు.

జూలపల్లి, ఎలిగేడు మండలాల విద్యార్థులు

జూలపల్లి: జూలపల్లి, ఎలిగేడు మండలాలకు చెందిన 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో కవిత బహుమతి అందజేశారు. ప్రథమ స్థానం పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు భవాని, వర్షిణికి రూ.5వేలు, ద్వితీయ స్థానం జెడ్పీహెచ్‌ఎస్ పెద్దాపూర్‌కు చెందిన రేఖ, హరిప్రియ రూ.4వేలు గెలుచుకోగా, తృతీయస్థానం దూళికట్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్షిత, చాదన రూ.3వేల నగదు అందుకున్నారు.

కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూళ్లో

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌పోటీల్లో విజేతలకు బహుమతి అందించారు. ప్రథమ స్థానం పొందిన తారుపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంబాడి మోహిత్, సుద్దాల మిథిలేశ్‌కు రూ.5వేలు, ద్వితీయ స్థానం పొందిన మీర్జంపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు చైతన్య, శ్రీచరణ్‌కు రూ.4వేలు, తృతీయ స్థానం పొందిన వెన్నంపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రష్మిత, రాంచరణ్‌కు రూ.3వేల నగదు బహుమతి అందజేశారు.

ఎన్టీపీసీ ఈడీకి సత్కారం



ఈడీని సత్కరిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ ఉత్తర ప్రదేశ్‌లోని ప్రాజెక్టుకు బదిలీ కావడంతో పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు మంగళవారం ఆయనను సన్మానించారు. ప్రాజెక్టు పరిపాలనా భవనంలోని చాంబర్‌లో ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి, ఎన్బీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాసర్ల వెంకటస్వామి, ఇన్‌చార్జి జనరల్ సెక్రటరీ కందుల స్వామి, ఆరెపల్లి రాజేశ్వర్, బండారిక కనకయ్య, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీజీఎంగా కేదార్ రంజన్ బాధ్యతలు

ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు సీజీఎంగా కేదార్ రంజన్ పాండు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రాజెక్టులో సీఈవోగా పని చేస్తున్న ఆయన ఇక్కడికి బదిలీపై వస్తున్నారు.

సీజీఎం ప్రసేంజిత్ పాల్ బదిలీ

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు సీజీఎం ప్రసేంజిత్ పాల్ సీసీ–ఈవోసీ సికింద్రాబాద్ కార్యాలయానికి, తెలంగాణ ప్రాజెక్టు జీఎం హరేరాంసింగ్ దర్లిపల్లి ప్రాజెక్టుకు బదిలీ కాగా దర్లిపల్లి జీఎం సంతోష్ తివారి, అనుపమ్ ముఖర్జీలు తెలంగాణ ప్రాజెక్టుకు జనరల్ మేనేజర్లుగా రానున్నారు.

'మేరా బూత్ సబ్ సే మజ్బూత్'

పెద్దపల్లిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భోపాల్ పట్టణం నుంచి 'నా బూత్, అన్నింటికన్నా బలమైనది'(మేరా బూత్ సబ్ సే మజ్బూత్) అనే నినాదంతో ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన కార్యక్రమంలో పెద్దపల్లి నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు. పట్టణంలోని 53వ బూత్ పరిధిలో బూత్ అధ్యక్షుడు పిట్ట వినయ్ నివాసంలో కార్యకర్తలతో కలిసి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డి కార్యక్రమాన్ని వీక్షించారు.

శాంతి వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: శాంతి వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సీఐ జగదీష్ అన్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై విజేందర్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తొలి ఏకాదశి, బక్రీద్ పండుగలు ఒకేరోజు వచ్చాయిని, అందరూ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

గోదావరిఖని: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్సైలు స్వామి, కమలాకర్ పాల్గొన్నారు.

మంథని: మంథని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ సతీశ్ ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాణి వర్మ ఉన్నారు.

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గ్రామాల నుంచి హాజరైన కులపెద్దలు, గ్రామస్తులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎస్సై వెంకటకృష్ణ, ఏఎస్సైలు విజయేందర్‌రెడ్డి, రామచంద్రయ్య, శ్రీనివాసరావు, హెచ్‌సీ శ్రావణ్‌కుమార్, రైటర్ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



శిక్షణను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

జూలపల్లి: మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి ఆకాంక్షించారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను 2018–19 నుంచి 2023 మార్చి వరకు ఏదైనా సంవత్సరంలో వందరోజులు పూర్తి చేసిన కుటుంబాలకు చెందిన 35 మంది మహిళలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, కరీంనగర్ ఎస్‌బీఐ, ఆర్‌సెటీ సహకారంతో టైలరింగ్ జూట్ బ్యాగుల తయారీ, క్యాండిల్స్, అగరువత్తుల తయారీ రంగాల్లో 13రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌తో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో వేణుగోపాలరావు, డీఆర్‌డీఏ, ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో సదానందం, వైస్ ఎంపీపీ రమేశ్, ఎస్‌బీఐ–ఆర్‌సెటీ డైరెక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్లు బురదమయంగా మారాయని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: పట్టణంలోని 25వ డివిజన్‌లోని రాజీవ్ హైవే నుంచి కేసీఆర్ కాలనీ మెయిన్‌రోడ్డు, పద్మావతికాలనీ, ప్రగతికాలనీ, ఆర్టీసీకాలనీ, సాయినగర్, శారదనగర్‌లోని రోడ్లపై నీళ్లు నిలిచి బురదమయంగా మారాయి. ఈమేరకు తెలంగాణ లేబర్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. నాయకులు గొర్రె రమేశ్, జనగామ లింగయ్య, గాజుల రమేశ్, తిరుపతి పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించండి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం రామగుండం మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్, రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, హమాలీ కార్మిక సంఘం నాయకులు ఎంఏ గౌస్ మాట్లాడారు. మార్కెట్‌లో రైతుల కోసం విశ్రాంతి గది ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలం, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ, హమాలీ కార్మిక సంఘం నాయకులు కామ్రేడ్ కండె లక్ష్మణ్, బండారి రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.